క్లుప్తంగా

రాములుకు జాతీయ పురస్కార అవార్డు

మహబూబ్‌నగర్ రూరల్: మదాసి, మదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ధన్వాడ రాములుకు జాతీయ పురస్కార అవార్డు దక్కింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ జిల్లా కళా సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నాగేష్ మహాత్మాజ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి 2025 సందర్భంగా ఈ పురస్కారం అందించారు. కర్నూల్ పట్టణంలోని సీ క్యాంపు టీజీవీ కళాక్షేత్రంలో రాములుకు సామాజిక సేవా కార్యక్రమాల కింద జాతీయ పురస్కార అవార్డు అందజేసి సత్కరించారు.

ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంతో పాటు మహబూబ్ నగర్ రూరల్ మండల పరిధిలో ఆదివారం సాయంత్రం, రాత్రివేళ కొద్దిసేపు ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆకాశం మేఘావృతమై మబ్బులతో కమ్ముకోగా ఉరుములు, మెరుపులతో పాటు ఈదురు గాలులు వీచాయి. దీంతో జిల్లా కేంద్రంలో పలుసార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మధ్యాహ్నం వరకు ఎండల తీవ్రత ఉన్నా సాయంత్రం నుంచి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉక్కపోతకు గురైన ప్రజలు ఆ తర్వాత ఊపిరి పీల్చుకున్నారు.

భారీ వర్షం: కూలిన రేకులషెడ్డు



అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని గ్రామాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో పాటు అరగంట పాటు భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పంట పొలాల్లో నీళ్లు నిలిచాయి. మూసాపేట మండలం వేముల శివారులో పంట పొలంలో రైతు చెక్క వెంకటయ్య నిర్మిస్తున్న రేకుల షెడ్డు గాలివానకు నేల కూలింది. వరి ధాన్యం ఆరబోసిన రైతులు వర్షం భారీ నుంచి కాపాడుకునేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు.

గుట్టుచప్పుడు కాకుండా ఒండ్రు మట్టి తరలింపు

దేవరకద్ర: దేవరకద్ర పెద్ద చెరువు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా కొందరు గుట్టు చప్పుడు కాకుండా పెద్ద ఎత్తున ఒండ్రుమట్టిని తరలిస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు. ప్రస్తుతం చెరువులో నీటి మట్టం తగ్గి పోవడంతో పెరుకు పోయిన ఒండ్రు మట్టిని మహబూబ్‌నగర్ రూరల్ మండల పరిధిలోని మన్యంకొండ సమీపంలోని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. ఇటుక బట్టీలకు కాంట్రాక్టర్ రాత్రి వేళ టిప్పర్ల ద్వారా ఒండ్రుమట్టిని తరలిస్తున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకొని ఒండ్రు మట్టి తరలింపును ఆపాలని కోరారు.

'మార్తండోమే మార్ రాజ్'



నవాబుపేట: 'వినండహో... ఇక నుంచి గతంలో మన జాతి మాట ప్రకారం మన తండాల పంచాయితీలు తండాలు దాటి వెల్లొద్దు.. తండాలోనే మన జాతి పెద్దలు దాన్ని పరిష్కరిస్తారు. ఇదే మా మాట, ఇదే జాతి పెట్టిన నిబంధన' తండాలోని ప్రజలకు దండోరా వేసి చెప్పారు. ఇది సినిమాలో డైలాగ్ లాగా కనిపించ వచ్చు కానీ ఇది నిజం. గిరిజన తండాలలో వచ్చే సమస్యలను వారే పరిష్కరించుకుని, వారే తీర్పులు చెబుతారు. ఎంతటి సమస్య వచ్చినా తండా దాడి పోకూడదు ఇది వారి కట్టుబాటు. దీనికి గిరిజన తండాలంతా కట్టుబడి ఉండాల్సిందే. కొన్ని వందల ఏళ్లుగా వస్తున్న ఆచారాన్ని తాజాగా ఆదివారం కొనసాగిస్తూ గిరిజనులు తీర్పు ప్రకటించారు. తమ గిరిజన తండాలకు నాయక్, కారోబార్లను ఏకగ్రీవంగా ఎన్నుకుని, వారి మాట జవ దాటమంటూ ప్రతిజ్ఞ చేశారు. మండలంలోని కాకర్‌జాల్ తండాకు చెందిన కెతావత్ తూక్యా నాయక్‌ను గిరిజన తండాలకు నాయక్‌గా ఎన్నుకున్నారు. అన్ని కార్యక్రమాలు నిర్వహించేలా ముడావత్ శ్రీనునాయక్‌ను కారోబార్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాకర్‌జాల్ తండాలో 'నాయక్ పాకాడి బందేరో కార్యా' అనే పేరుతో కార్యక్రమం నిర్వహించి తండా పెద్దలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండలంలోని 18 తండాల గిరిజనులు పాల్గొన్నారు. గత వంద సంవత్సరాల క్రితం నాయక్‌గా ఇదే తండాకు చెందిన లాల్యానాయక్‌ను నాయక్‌గా ఎన్నుకున్నారు. ఆయన మరణ అనంతరం ఆయన కుమారుడు దేవ్యా బాధ్యతలు చేపట్టాడు. ఆయన సైతం ఇటీవల మరణించిన తరుణంలో ఆయన స్థానంలో ఆయన కుమారుడు తూక్యానాయక్‌ను గిరిజనుల పెద్దగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వివిధ తండాలకు చెందిన సంతోష్‌నాయక్, చందర్‌నాయక్, సేవ్యా, లింబ్యానాయక్, శంకర్‌నాయక్, నీల్యానాయక్, ప్రేమ్‌కుమార్, భాస్కర్, గోపాల్, రాజు, నాన్యానాయక్ పాల్గొన్నారు.

'అరకొర' సిబ్బంది



గండేడ్ ఎంపీడీఓ కార్యాలయం

- కార్యాలయాలు కొత్తవి.. అధికారులు పాతవారే..
- అవస్థలు పడుతున్న అధికారులు
- సుపరిపాలనకు ఆటంకం

గండేడ్: తెలంగాణ ఏర్పడ్డాక పరిపాలనా సౌలభ్యం, పాలనలో పారదర్శకతలో భాగంగా జిల్లాలతో పాటు మండలాలను కూడా విభజించారు. మండల స్థాయిలో మండల కార్యాలయాలు ఏర్పాటు చేసి సేవలందించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఆలోచన బాగున్న ఆచరణ లోపం వల్ల సుపరిపాలనలో అవస్థలు తప్పడం లేదు. ఇందుకు నిదర్శనం గండేడ్, మహమ్మదాబాద్ మండలాలను పేర్కొనవచ్చు. 75వేలకు పైగా జనాభా కలిగి, 24 గ్రామ పంచాయతీలతో గతంలో గండేడ్, మహమ్మదాబాద్ మండలాలు కలిసే ఉండేవి. 2020 ఉమ్మడి మండలాన్ని రెండుగా విభజించారు. గండేడ్, మహమ్మదాబాద్ మండలాలు రెండుగా ఏర్పడ్డాయి. ఈరెండు మండలాల పరిధిలో గ్రామ పంచాయతీలనూ కొత్తవాటిని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా రెండు మండలాల్లో గతంలో 24కు బదులు 49 గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. మహమ్మదాబాద్‌లో 22 గ్రామ పంచాయతీలు ఉండగా, గండేడ్‌లో 27 గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి రెవెన్యూ, వ్యసాయ, పంచాయతీ రాజ్ శాఖలు రెండు మండలాలకు వేరుగా ఉండేవి. పోలీసు, ఎంపీడీఓ కార్యాలయాలు మాత్రం రెండు మండలాలకు ఒక్కటే ఉండేవి.

మహమ్మదాబాద్‌లో ఎంపీడీఓ కార్యాలయం

మండలాల ఏర్పాటు తర్వాత ఎంపీపీ, జడ్పీటీసీ ఉమ్మడిగా ఒక్కొక్కరే ఉండడంతో అప్పట్లో ఎంపీడీఓ కార్యాలయాన్ని వేరు చేయలేదు. దీంతో గండేడ్ నుంచి పరిపాలన కొనసాగేది. వారి పదవీ కాలం ముగియడంతో కొత్తగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, ఎంపీడీఓ కార్యాలయాన్ని వేరు చేయాలని ఖచ్చితమైన ఆదేశాలు రావడంతో శకొత్తది ఏర్పాటు అనివార్యం అయ్యింది. దీంతో ఈఏడాది జనవరి 31 ఎంపీడీఓ కార్యాలయం వేరైంది. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కొత్త ఎంపీడీఓ కార్యాలయాన్ని మహమ్మదాబాద్‌లో ప్రారంభించారు. పక్కా భవనం లేకపోవడంతో ప్రాథమిక పాఠశాలలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు.

ఉన్న సిబ్బందే సర్దుబాటు..

కార్యాలయాలు రెండు ఏర్పాటైనా సిబ్బందిని మాత్రం ఉన్నవారినే సర్దారు. గండేడ్‌లో ఉన్న సిబ్బందినే అక్కడికి పంపారు. గండేడ్ ఎంపీఈఓ నరేందర్‌రెడ్డికి మహమ్మదాబాద్ ఇన్‌చార్జి ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇతను రెండు మండలాలకు ఎంపీఈఓగా కూడా విధులు నిర్వహిస్తున్నాడు. సీనియర్ అసిస్టెంట్ సత్యయ్యను అక్కడికే పంపించారు. టైపిస్టు శ్రీలతతో పాటు ఒక అటెండర్‌ను కూడా మహమ్మదాబాద్‌కు కేటాయించారు. గండేడ్ మండలం సూపరింటెండెంట్ ప్రతాప్‌రెడ్డి కూడా రెండు మండలాలకు బాధ్యత వహిస్తున్నాడు. పీఆర్ఏఈలు మాత్రం రెండు మండలాలకు వేరుగా నియమించారు. ఎంపీడీఓ దేవన్నతో పాటు ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు అటెండర్లు గండేడ్‌లో ఉండగా మరో అటెండర్‌ను రాజాపూర్‌కు డిప్యూటేషన్ ఇచ్చారు. ఉపాధి పనుల పర్యవేక్షించే ఏపీఓ హరిశ్చందర్‌తో పాటు ఇతర టీఏలు ఉమ్మడి మండలానికి విధులు నిర్వహిస్తున్నారు.

పెరుగుతున్న పనిభారం..

ఒకే కార్యాలయం సిబ్బందిని అధికారులను రెండు మండలాలకు సర్దుబాటు చేయడం వల్ల పనిభారం పెరుగుతోంది. అరకొర సిబ్బందితో రెండు మండలాల్లో పనుల నిర్వహణ కష్టంగా మారింది. గ్రామాల్లో పారిశుద్ధ్యం, పరిపాలన నిర్వహణ, అభివృద్ధి పనులు కొనసాగించడం, ఉపాధి పనుల పర్యవేక్షణ, రెగ్యులర్‌గా నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లు, పలు రకాల పనులతో అధికారులు అక్కడ, ఇక్కడ ఉరుకులు పరుగులు పెట్టాల్సి వస్తున్నది. అసలే గ్రామాల్లో నిధుల కొరత ఉండడంతో గ్రామపాలన తలకు మించిన భారంగా మారింది. కొత్తగా ఎంపీడీఓ కార్యాలయం ఏర్పాటు చేసి కొత్త సిబ్బందిని మాత్రం నియమించకపోవడం విడ్డూరంగా ఉంది.

స్థానిక సంస్థల ఎన్నికలు జరగాల్సి ఉంది

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలతో పాటు సర్పంచ్ ఎన్నికలు కూడా జరగాలి. రెండు మండలాలకు కొత్తగా వేర్వేరుగా జెడ్పీటీసీ ఎంపీపీల ఎన్నికలు నిర్వహించాలి. దీంతో పనిభారం మరింతగా పెరిగే అవకాశం ఉంది. మహమ్మదాబాద్ ఎంపీడీఓ కార్యాలయం పాఠశాల భవనంలో కొనసాగుతోంది. అసౌకర్యాల వల్ల అధికారులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెండు మండలాల ఎంపీడీఓ కార్యాలయాలకు పూర్తి స్థాయి సిబ్బందిని నియమించి సుపరిపాలనకు బాటలు వేయాలని ఇరు మండలాల ప్రజలు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



సిబ్బంది పూర్తి స్థాయిలో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పనుల నిర్వహణ తలకు మించిన భారం అవుతున్నది. ఉపాధి పనులు రెండు మండలాలకు పర్యవేక్షించడం కష్టతరంగా మారింది. మీటింగులు, కాన్ఫరెన్స్‌లు, పనుల పర్యవేక్షణ తదితర కార్యక్రమాలతో ఉదయం వచ్చి రాత్రిళ్లు ఇళ్లకు వెళ్తున్నాం. సిబ్బంది సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరితగతిన కొత్త సిబ్బందిని నియమిస్తే ఎవరి పనులు వారు సకాలంలో పూర్తి చేసుకోగలుగుతాం.

– దేవన్న, ఎంపీడీఓ, గండేడ్

పేదలకు అండగా ప్రభుత్వం



దమగ్నాపూర్‌లో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ గ్రామంలో దేవరకద్ర మండలం చౌదరిపల్లి శివకుమార్‌కు, కౌకుంట్ల మండలం ముచ్చింతల గ్రామానికి చెందిన సంధ్యారాణిలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. అందుకు పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో కురుమూర్తి స్వామి ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, తిరుపత్‌రెడ్డిఉన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులు చదువుతో పాటు కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని ఎంఐఎం జిల్లా అధ్యక్షులు అబ్దుల్ హాదీ అన్నారు. జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో కింగ్‌షోటోకాన్ కరాటే దూ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి ఉచిత కరాటే శిక్షణలో భాగంగా ఆదివారం యోగా శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అబ్దుల్ హాదీ యోగా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 27 ఏళ్ల నుంచి జహంగీర్‌పాష ఖాద్రీ వేసవిలో ఉచిత కరాటే శిక్షణ శిబిరాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. కరాటే శిక్షణను వేసవి వరకు పరిమితం కాకుండా నిరంతరం ప్రాక్టిస్ చేయాలని కోరారు. కింగ్‌షోటోకాన్ వైస్ చైర్మన్ చెన్న వీరయ్య మాట్లాడుతూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. అంతకుముందు యోగా టీచర్ బాలమణి యోగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ మీర్ అర్షద్‌అలీ, కింగ్ షోటోకాన్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రఫీక్ అహ్మద్, మహ్మద్ అతహర్, ఎండీ జాకీర్, కరాటే విద్యార్థులు నవీన్, అర్ష జమీల్, అమాన్‌ఖాన్, మహ్మద్ షరీఫ్, తుపుడ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



యోగా శిబిరాన్ని ప్రారంభిస్తున్న అబ్దుల్ హాదీ

హోరెత్తిన మైసమ్మ నామస్మరణ

నవాబుపేట: మండలంలోని పర్వాతాపూర్ మైసమ్మ దేవాలయం చెంత భక్తుల సంత కొనసాగింది. ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు అడవిలో వెలసిన మైసమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దీంతో పాటు అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. భక్తుల సందడితో అడవి మొత్తం మైసమ్మ నామస్మరణ హోరెత్తింది. అటు జిల్లా కేంద్రం, ఇటు మండల కేంద్రం ప్రధాన రోడ్లు జనంతో కిటకిటలాడాయి. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.



మైసమ్మ దేవాలయంలో భక్తుల సందడి

పంటకు గిట్టుబాటు ధర చెల్లించాలి

కోయిల్‌కొండ: దేశంలో కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర చెల్లించి మద్దతు ధరల గ్యారంటీ చట్టం చేయాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొండ నర్సింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బూర్గుపల్లి, చిన్నలింగల్‌చేడ్, శేరివెంకటాపూర్, ఖాజీపూర్, కోయిల్‌కొండ గ్రామాలలో ఈనెల 20న జరిగే రైతు, కార్మిక సంఘాల నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కరప్రతాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక నూతన జాతీయ మార్కెట్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు గ్యారంటీ చట్టం అమలు చేయాలని, ఉపాధి కూలీలకు 200 రోజులు పనిదినాలు కల్పించాలని, ప్రతికూలీకి కొలతలతో సంబంధం లేకుండా రూ.600లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల కార్యదర్శి ఊశప్ప, సాయప్ప, తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న కార్మిక సంఘం జిల్లా నాయకులు

జేపీఎల్ విన్నర్ ఆంజనేయ సంఘం జట్టు



విన్నర్ పంచముఖ ఆంజనేయ సంఘం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఆనంద్‌గౌడ్

- రన్నరప్‌గా స్వామివివేకానంద జట్టు
- ముగిసిన జేపీఎల్–3 టోర్నమెంట్

మహబూబ్‌నగర్ క్రీడలు: పట్టణ జాంద్ర యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న జాంద్ర ప్రీమియర్‌లీగ్–3 (జేపీఎల్) విన్నర్‌గా పంచముఖ ఆంజనేయ సంఘం జట్టు నిలిచింది. స్వామివివేకానంద జట్టు రన్నర్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన స్వామివివేకానంద జట్టు 8 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 80 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పంచముఖ ఆంజనేయ సంఘం జట్టు 7.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 83 పరుగులు చేసింది. అంతకుముందు జరిగిన మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో వారియర్స్ జట్టు 8 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 65 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన స్వామివివేకానంద జట్టు 7 ఓవర్లలో వికెట్ కోల్పోయి 66 పరుగులు చేసి విజయం సాధించింది. రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో జాంద్ర టైటాన్స్ జట్టు 7 ఓవర్లలో 38 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన పంచముఖ ఆంజనేయ సంఘం జట్టు 3 ఓవర్లలో వికెట్ కోల్పోయి 40 పరుగులు చేసింది. చెస్ పోటీల్లో విన్నర్‌గా టంకశాల లక్ష్మీనారాయణ, రన్నర్‌గా డాక్టర్ కె.బాలకృష్ణ నిలిచారు. విన్నర్, రన్నర్ జట్లకు మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ జాంద్ర యువజన సంఘం అధ్యక్షులు సద్దె పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి టంకశాల మల్లేష్, కోశాధికారి పోతినెపల్లి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులు దోమ సాయికుమార్, నాగలి విశ్వకాంత్, సంయుక్త కార్యదర్శులు వన్నాడ అనిల్‌కుమార్, గడిగె చంద్రశేఖర్, కనికె పవన్‌కుమార్, బుట్టా అవినాష్, ప్రచార కార్యదర్శి శ్రీశైలం, కనికె శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

జడ్చర్ల: యువతి అదృశ్యమైన సంఘటన పట్టణంలోని పాతబజార్‌లో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పాత బజార్‌కు చెందిన మాదురి(23) శనివారం పాల ప్యాకెట్ కొనుగోలు చేసేందుకు ఇంటి నుంచి బయటికి వెళ్లింది. సాయంత్రమైన యువతి ఇంటికి రాకపోవడంతో తల్లి భారత్ బాయి స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చే స్తున్నట్లు సీఐ తెలిపారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

హన్వాడ: మండల కేంద్రంలోని ది ఎవరెస్ట్ టాలెంట్ స్కూల్‌లో సోమవారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు మహేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ పరిశీలకులు సాంబ య్య, భాస్కర్‌యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు ఎస్పీ వెంకటేష్, సురేందర్‌రెడ్డి వస్తున్నట్లు వివరించారు. కార్యక్రమానికి మండలంలోని నా యకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

హన్వాడలో తిరంగా ర్యాలీ



హన్వాడలో తిరంగా ర్యాలీ ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ వి.శేఖర్

హన్వాడ: మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ నాయకులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. పహల్గాం దాడికి నిరసనగా, ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ వడ్ల శేఖర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మండల కేంద్రంలో పూర వీధుల గుండా ర్యాలీ చేస్తూ జిల్లా కేంద్రానికి బయలుదేరింది. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షు డు కొండ లింగన్న, నాయకులు వెంకటయ్య, శ్రీనివాస్‌గౌడ్, వేణు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ కృష్ణ య్యగౌడ్, జుక్యానాయక్, చెన్నప్ప, తిర్పతయ్య, కొండ లక్ష్మయ్య, చంద్రశేఖర్, చింటు, రాజు, శేఖర్, వివిధ గ్రామాల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



అడ్డాకులలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



మూసాపేట మండలం వేములలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండలంలోని వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అడ్డాకులలో 1999–2000 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత అదే పాఠశాల లో కలుసుకున్నారు. నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు సత్యన్న, శ్రీనివాస్, శ్రీనివాస్‌సాగర్‌లను సమ్మేళనానికి ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 పదో తరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులు కొండా రెడ్డి, వహీద్, నిర్మల, సంజీవరెడ్డి, సుభాష్‌రెడ్డిలను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో రఘు, నరేందర్(ఎస్ఐ ఆత్మకూర్), శ్రీధర్‌రెడ్డి, రాజేష్, వెంకట్రాంరెడ్డి, రాకేష్, సత్యం, చైతన్య, సుభాషిణి, శ్రీదేవి, శ్వేత, కల్యాణి, రాధ పాల్గొన్నారు.

- దేవరకద్ర మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 2002–03లో పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు. 22 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఆనాడు తమకు విద్యను నేర్పిన గురువులకు ఘనంగా సన్మానించారు.

గోడు వినేదెవరు..?

గోపాలమిత్రలకు వేతనాలు అందక ఇబ్బందులు

- తొమ్మిది నెలలుగా ఇదే దుస్థితి
- ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో మొత్తం 214 మంది గోపాలమిత్రలు



పశువైద్యుడితో కలిసి పశువులకు సేవలందిస్తున్న గోపాలమిత్ర

మరికల్: మారుమూల పల్లెలు.. పశువైద్యశాలలు అందుబాటులో లేని పల్లెల్లో పాడి రైతుల ఇంటి ముంగిట్లో అత్యవసర సేవలు అందిస్తూ.. పశువులకు సంబంధించిన సీజనల్ వ్యాధులపై వాటి యజమానులను అప్రమత్తం చేస్తూ.. పశువులకు అత్యవసర చికిత్సలు చేయడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారు గోపాల మిత్రలు. ప్రస్తుతం వారి పరిస్థితి దయనీయంగా మారింది. తొమ్మిది నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. నిత్యం గ్రామాలను తిరుగుతూ క్షేత్ర స్థాయిలో పాడి రైతులకు సేవలందించడంతోపాటు ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ, సామాజిక కార్యక్రమాల్లో సైతం గోపాలమిత్రలు భాగస్వామ్యం అవుతున్నారు. కానీ వీరి గోడు మాత్రం ఎవరూ వినడం లేదు. ఒకటి కాదు.. రెండు కాదు.. తొమ్మిది నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 214 మంది గోపాలమిత్రలు ఉన్నారు. వీరంతా వేతనాలు అందక కుటుంబ పోషణ భారంగా నెట్టుకొస్తున్నారు.

పశువైద్యంలో కీలకపాత్ర

వ్యవసాయ అనుబంధంగా పాడి రంగంలో మేలు జాతి ఆవులు, గేదెల పునరుత్పత్తి, పాల ఉత్పత్తి, ఉత్పాదక పెంపు లక్ష్యంగా గోపాలమిత్ర వ్యవస్థ ఏర్పాటైంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు 2.50 లక్షలకు పైగా పశువులు ఉండగా 214 మంది గోపాలమిత్రలు సేవలు అందిస్తున్నారు. పశువులకు కృతిమ గర్భధారణ చేయడంతోపాటు మేకలు, గొర్రెలకు వీరు ప్రాథమిక వైద్యం అందిస్తున్నారు. అలాగే పశువులకు టీకాలు, నట్టలు, గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయడంలో గోపాలమిత్రల పాత్ర కీలకం. ఒక్కొక్కరికి నెలకు గౌరవ వేతనంగా రూ.11,050 చెల్లిస్తున్నారు.

బడ్జెట్ రావాల్సి ఉంది

గోపాల్‌మిత్రలకు సంబంధించి 9 నెలల వేతనాలు రావాల్సి ఉంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. బడ్జెట్ విడుదల కాగానే వారి ఖాతాల్లో వేతనాలు జమ చేస్తాం.

– మధుసూదన్‌గౌడ్, జేడీ, మహబూబ్‌నగర్

లక్ష్యాన్ని చేరుకోలేదంటూ..

పశువుల సంఖ్య మేరకు గోపాలమిత్రలకు కృతిమ గర్భధారణ లక్ష్యాన్ని నిర్దేశిస్తున్నారు. ఒక్కో గోపాలమిత్ర నెలకు 100 పశువులకు కృతిమ గర్భధారణ చేయాలి. కానీ గ్రామీణ ప్రాంతాలు కావడంతో పాడి రైతులు సహజ గర్భధారణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో వీరు లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. ఇదే కారణం చూపుతూ అధికారులు గోపాలమిత్రల వేతనాల్లో కోతలు విధిస్తున్నారు. అసలే అంతంత మాత్రంగా వచ్చే వేతనాల్లో.. కోత విధించడంతో మేం ఎలా బతికేది అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు నెల నెల వేతనాలు చెల్లించకపోవడంతో అప్పులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి వస్తోందని వాపోతున్నారు. ఈ విషయంపై పలువురు గోపాలమిత్రలు తమ ఇబ్బందులను మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా వేతనాలు విడుదల చేసేలా చూడాలని కోరుతున్నారు.